వైభవంగా యాదగిరీశుడి తిరుకల్యాణోత్సవం

స్పటికలింగేశ్వరుడికి రుద్రాభిషేకం నిర్వహిస్తున్న పురోహితులు

యాదగిరిగుట్ట, జూలై 22 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్ల నిత్య తిరుకల్యాణోత్సవం అత్యంత వైభవంగా సాగింది. సోమవారం ఉదయం మొదటి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం జరిపిన అర్చకులు ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి గజ వాహనంపై వేంచేపు చేసి కల్యాణోత్సవ సేవను జరిపారు. కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి కల్యాణ తంతు చేపట్టారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. ప్రధానాలయం ముఖ మండపంలో స్వామివారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు సువర్ణ పుష్పార్చన జరిపించారు. బంగారు పుష్పాలతో దేవేరులకు అర్చన చేశారు. సాయంత్రం స్వామివారికి తిరువీధి సేవ, దర్బార్‌సేవ చేపట్టారు. అనుబంధ రామలింగేశ్వరస్వామి ప్రధానాలయంలో పరమశివుడు, స్పటిక లింగేశ్వరుడికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం వైభవంగా సాగింది. 6వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. స్వామివారి ఖజానాకు రూ.13,59,707 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

ప్రజావాణి సమస్యలపై తక్షణమే స్పందించాలి

- అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్

ప్రజావాణిలో అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్‌కు వినతి పత్రం ఇస్తున్న టీఎస్ ఎమ్మార్పీఎస్ నాయకులు

భువనగిరి కలెక్టరేట్, జూలై 22 : ప్రజావాణి దరఖాస్తులకు అధిక ప్రాధాన్యమిచ్చి వేగంగా పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ పి.బెన్ షాలోమ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై అధికారులు అలసత్వం వహించవద్దన్నారు. ప్రజావాణిలో వచ్చే ప్రతి సమస్యా పరిష్కరించబడేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అర్జిదారుల నుంచి 59 దరఖాస్తులు రాగా.. అందులో రెవెన్యూ శాఖకు – 49, డీపీఓ – 2, సాంఘిక సంక్షేమ శాఖ – 2, జిల్లా గ్రామీణాభివృద్ధి, పశు సంవర్ధక, విద్య, మున్సిపాలిటీ, రవాణా, ఖనిజ, భూగర్భ శాఖలకు ఒక్కొక్కటి చొప్పున అందాయన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ ఎంఏ కృష్ణన్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జయశ్రీ, కలెక్టరేట్ సూపరింటెండెంట్ పార్థసింహారెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చాలని వినతి

రైతులకు నష్టం చేకూరేలా ఉన ట్రిబుల్ ఆర్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలని రీజనల్ రింగ్ రోడ్డు బాధితుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణిలో వినతి పత్రం అందజేశారు. గతంలో పలుమార్లు అభివృద్ధి పేరుతో రైతుల నుంచి భూమి తీసుకున్నారని, ఇప్పుడు ట్రిబుల్ ఆర్ రోడ్డుకు భూమి ఇచ్చేది లేదని బాధితులు పేర్కొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి'

ఈ పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని టీఎస్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు చిలకమారి గణేశ్ మాదిగ అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి అదనపు కలెక్టర్ పి.బెన్‌షాలోమ్‌కు వినతి పత్రం అందజేశారు. మూడు దశాబ్దాలుగా పోరాటం చేస్తున్నా వర్గీకరణ అమలు కాకపోవడం దురదృష్టకరమన్నారు. 100 రోజుల్లో చట్టబద్ధత కల్పిస్తామని బీజేపీ మాదిగలకు హామీ ఇచ్చి మోసం చేసిందని విమర్శించారు.

నాలుగేండ్ల చిన్నారికి సిండక్టిలీ శస్త్ర చికిత్స

- అంటుకుని ఉన్న తేతి వేళ్లను విడదీసిన ఎయిమ్స్ వైద్యులు

అతుక్కుని ఉన్న చేతి వేళ్లకు ఆపరేషన్ చేసి విడదీసిన ఎయిమ్స్ వైద్యులు

బీబీనగర్, జూలై 22 : మండలంలోని బీబీనగర్ ఎయిమ్స్‌లో నాలుగేండ్ల బాబుకు తన చేతి వేళ్లు రెండు అతుక్కుని ఉండగా వైద్యులు మూడు నెలల క్రితం నిర్వహించిన శస్త్రచికిత్స విజయవంతం అయ్యింది. ఈ సందర్భంగా డాక్టర్ మూలా రోహిత్ మాట్లాడుతూ సిండక్టిలీ వ్యాధి రోగి రోజువారీ కార్యక్రమాలు నిర్వహించడం కష్టతరం చేస్తుందన్నారు. పెరుగుదల ప్రక్రియలో చేతి వేళ్లు వంకరగా అవడం, వైకల్యంతో చేతిని పనిచేయకుండా చేస్తాయని తెలిపారు. ముందుగా గుర్తించి, చికిత్స చేస్తే సాధారణ స్థితికి తీసుకురావచ్చని పేర్కొన్నారు. శస్త్రచికిత్సకు 2.5 గంటల పాటు శ్రమించాల్సి వచ్చిందన్నారు. ఇందులో రెండు వేళ్ల రక్త నాళాలు, చర్మంతో కలిసి చిక్కుకున్న నరాలను జాగ్రత్తగా వేరు చేయడం జరిగిందని తెలిపారు. వేళ్లను వేరు చేసిన తర్వాత వేళ్లపై అదనపు చర్మాన్ని అంటు కట్టామని చెప్పారు.

సరైన విధానాలు లేకే అందరికీ అందని రుణమాఫీ

- తుర్కపల్లి పీఏసీఎస్ చైర్మన్ నరసింహారెడ్డి

తుర్కపల్లి సమావేశంలో మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ నరసింహారెడ్డి

తుర్కపల్లి, జూలై 22 : ప్రభుత్వానికి రుణమాఫీపై సరైన అవగాహన, విధివిధానాలు లేకపోవడంతో రుణమాఫీ కాక రైతులు మనోవేదనకు గురవుతున్నారని తుర్కపల్లి పీఏసీఎస్ చైర్మన్ సింగిరెడ్డి నరసింహారెడ్డి అన్నారు. సొసైటీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఏసీఎస్ పరిధిలో రూ.లక్షలోపు 822 మంది రైతులకు, రూ.లక్షా 50వేలలోపు 218 మంది, రూ.2లక్షల వరకు 11మంది రైతులు రుణాలు పొందారన్నారు. లక్షలోపు రుణాలు తీసుకున్నవారు 822 మంది ఉండగా.. 495 మంది రైతులకు మాత్రమే 2,09,67,153 రూపాయలు జమ చేసిందని తెలిపారు. ఇంకా రూ.లక్షలోపు 327మంది రైతులకు రుణాలు మాఫీ కాలేదన్నారు. ఆర్హులైన రైతులందరికీ ప్రభుత్వం వెంటనే రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ కొండ్రా ముత్యాలు, డైరెక్టర్లు చింతపండు చంద్రమౌళి, రాంచంద్రం పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి

విద్యార్థులకు నోట్ బుక్స్ అందజేస్తున్న కస్తూరి ఫౌండేషన్ సభ్యులు

సంస్థాన్ నారాయణపురం, జూలై 22 : విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని కస్తూరి ఫౌండేషన్ సభ్యుడు నరేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని పుట్టపాక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఫౌండేషన్ సభ్యులు సోమవారం నోట్ బుక్స్, డిక్షనరీలు, గ్రామర్ బుక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే కస్తూరి ఫౌండేషన్ చైర్మన్ కస్తూరి శ్రీచరణ్ లక్ష్యమన్నారు. ప్రతి సంవత్సరం పుట్టపాక ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న కస్తూరి ఫౌండేషన్ సభ్యులకు పూర్వ విద్యార్థి, సీనియర్ జర్నలిస్ట్ మర్రి మహేందర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు 140 మందికి బ్యాగులు అందించారు. ప్రధానోపాధ్యాయుడు హనుమంతు, ఫౌండేషన్ సభ్యులు వీరమళ్ల కార్తీక్, రామకృష్ణ, గ్రామ పెద్దలు పెద్దులు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి సర్కారు కృషి

- తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్
- మోత్కూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కలెక్టర్‌తో కలిసి సీసీ కెమెరాల ప్రారంభం

మోత్కూరు ప్రభుత్వ పాఠశాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సామేల్, చిత్రంలో కలెక్టర్ జెండగే

మోత్కూరు, జూలై 22 : రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చి పని చేస్తున్నదని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మోత్కూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తనతోపాటు పాఠశాల పూర్వ విద్యార్థులు అందించిన విరాళాలతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను కలెక్టర్ హనుమంతు కె.జెండగేతో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ తనకు వచ్చిన గౌరవ వేతనాన్ని పాఠశాలలో సీసీ కెమెరాల ఏర్పాటుకు విరాళంగా అందజేశానని చెప్పారు. పాఠశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అసంపూర్తిగా ఉన్న మరుగుదొడ్లు, డైనింగ్ భవనాల పనులకు కలెక్టర్ ప్రత్యేక కోటా నిధులను మంజూరు చేసి పూర్తి చేయాలని కోరారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలను రెండు వారాల్లో గుర్తించి నిధులు మంజూరు చేయించి పనులు చేపడుతామని చెప్పారు. అంతకుముందు మున్సిపల్ ఆఫీసు ఆవరణంలో రెండు స్వచ్ఛ ఆటోలు, ఒక ట్రాలీ ట్రాక్టర్‌ను ప్రారంభించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తీపిరెడ్డి గోపాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవిత, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ పేలపుడి వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జి డీఈఓ ప్రశాంత్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, వైస్ చైర్మన్ వెంకటయ్య, ఎంపీడీఓ శంకరయ్య, అమ్మ ఆదర్శ కమిటీ చైర్‌పర్సన్ దబ్బెటి శైలజ, రెడ్ క్రాస్ చైర్మన్ జి.లక్ష్మీనర్సింహారెడ్డి పాల్గొన్నారు.

కేజీబీవీ పాఠశాల పరిశీలన

అడ్డగూడూరు : మండలంలోని కంచనపల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఎమ్మెల్యే సామేల్, కలెక్టర్ హనుమంతు కె.జెండగే పరిశీలించారు. పాఠశాల ఎస్ఓ సరితతో మాట్లాడి విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందించాలని సూచించారు. పాధ్యాయులు సమయపాలన పాటించాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. వాష్‌రూమ్‌లు సరిపడా లేవని, నీటి సమస్య ఉన్నదని, ఇంటర్ ఫిజికల్ సైన్స్, జువాలజీ ఉపాధ్యాయులు లేరని విద్యార్థినులు కలెక్టర్, ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. పాఠశాలలో ఏం సమస్యలు ఉన్నాయో నివేదిక సిద్ధం చేసి ఇవ్వాలని డీఈఓ ప్రశాంత్‌రెడ్డిని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం మానాయికుంట గ్రామంలో చెక్ డ్యామ్ నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు. మోత్కూరు మండలం పొడిచేడు నుంచి శాలిగౌరారం మండలం చిత్తలూరు వరకు మూసీ నదిలో 5 చెక్‌డ్యామ్‌లు నిర్మించనున్నట్లు ఎమ్మెల్యే సామేల్ తెలిపారు. వాటితో 10వేల ఎకరాలకు సాగునీరు అందనున్నదని పేర్కొన్నారు. కార్యక్రమంలో తాసీల్దార్ శేషగిరి రావు, ఎంపీడీఓ శంకరయ్య, డీఈ సత్యనారాయణ, సింగిల్‌విండో చైర్మన్ కొప్పుల నిరంజన్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

'రైతులందరికీ ఒకేసారి రుణమాఫీ చేయాలి'

మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ బాలనర్సింహ

బొమ్మలరామారం, జూలై 22 : ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికీ ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ వర్తింపజేయాలని పీఏసీఎస్ చైర్మన్ గూడె బాలనర్సింహ అన్నారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఏసీఎస్‌లో రుణం పొందిన 835 మంది రైతులకు గానూ 229 మంది రైతులకు మాత్రమే రుణమాఫీ అయ్యిందన్నారు. ఇంకా 687 మందికి రుణమాఫీ జరుగలేదని, వారికి వెంటనే మాఫీ వర్తింపజేయాలని కోరారు. బ్యాంకులో బంగారు ఆభరణాలు కుదువ పెట్టి తీసుకున్న రుణాలను కూడా మాఫీ చేయాలన్నారు. రైతు భరోసా డబ్బులను పది రోజుల్లో రైతుల ఖాతాల్లో జమ చేయకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో పీఏసీఎస్ డైరెక్టర్ కొండోజు ఆంజనేయులు, రైతులు పాల్గొన్నారు.

ఆలేరు రెవెన్యూ డివిజన్‌గా ప్రకటన చేయించాలి

మాట్లాడుతున్న అఖిలపక్ష కమిటీ కన్వీనర్ వీరేశం

ఆలేరు రూరల్, జూలై 22 : త్వరలో జరుగనున్న అసెంబ్లీ సమావేశాల్లో ఆలేరును రెవెన్యూ డివిజన్‌గా గుర్తిస్తూ ప్రభుత్వంతో ప్రకటన చేయించాలని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యను అఖిలపక్ష కమిటీ కన్వీనర్ పుసుపునూరి వీరేశం డిమాండ్ చేశారు. ఆలేరులో సోమవారం ఏర్పాటు చేసిన అఖిలపక్ష కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆలేరును రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన హామీ మేరకు ఆలేరును రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేసేందుకు అధికారిక ప్రకటన చేయించాలని కోరారు. సమావేశంలో అఖిలపక్ష కమిటీ సభ్యులు రాచకొండ జనార్దన్, చెక్క వెంకటేశ్, మొరిగాడి చంద్రశేఖర్, కామిడి ఉప్పలయ్య, కళ్లపు అడవయ్య, పంగ రవి, మల్‌రెడ్డి సాంబిరెడ్డి పాల్గొన్నారు.

రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలి : ఏఓ

మోటకొండూరు : రైతు బీమా దరఖాస్తులను తీసుకుంటున్న ఏఓ సుజాత

మోటకొండూర్, జూలై 22 : మండలంలోని రైతులు 2024-25 సంవత్సరానికి రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏఓ సుబ్బూరి సుజాత అన్నారు. మండల కేంద్రంలో సోమవారం రైతుల నుంచి బీమా దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూన్ 28వరకు డిజిటల్ సంతకం అయిన పట్టాదారు రైతులు, పట్టాదారు పాస్ పుస్తకాలు వచ్చి ఇప్పటి వరకు రైతు బీమా చేసుకోని రైతులందరూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుకు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్, నామినీ ఆధార్ జత చేసి నేరుగా వ్యవసాయ అధికారులకు ఇవ్వాలని తెలిపారు.

రామన్నపేట (వలిగొండ) : మండలంలోని రైతులు రైతు బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏఓ అంజనీదేవి అన్నారు. వలిగొండ రైతు వేదికలో సోమవారం బీమా దరఖాస్తులను స్వీకరించి మాట్లాడారు. పట్టాదారు పాస్ పుస్తకం పొంది ఉండి, 18నుంచి 59 ఏండ్లలోపు ఉన్న రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మండల వ్యవసాయ కార్యాలయంలో ఆగస్టు 4లోపు దరఖాస్తులను అందజేయాలని సూచించారు.

బొమ్మలరామారం : కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన రైతులు రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏఓ పద్మ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం రైతు వేదిక వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. 18నుంచి 59 సంవత్సరాల వయస్సు ఉన్న రైతులందరూ రైతు బీమాకు అర్హులని తెలిపారు. గతంలో రైతు బీమాలో నమోదైన రైతులు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదనిన్నారు. రుణ మాఫీపై ఎలాంటి సందేహాలున్నా తమ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

ఆత్మకూరు(ఎం) : రైతుబీమా కోసం జూన్ 28వరకు డిజిటల్ సంతకమై పట్టాదారు పాస్‌పుస్తకాలు పొందిన రైతులందరూ దరఖాస్తు చేసుకోవాలని ఏఓ సుబ్బూరి సుజాత అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం రైతుల నుంచి రైతు బీమా దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో ఏఈఓ మనీషా పాల్గొన్నారు.

మాజీ మంత్రి కేటీఆర్‌ను విమర్శించడం తగదు

- బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కృష్ణ

మోటకొండూరు, జూలై 22 : మాజీ మంత్రి కేటీఆర్‌పై ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి ఎగ్గిడి కృష్ణ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందు బీర్ల ఐలయ్య నడిపించిన బీర్ల ఫౌండేషన్ ఎటు పోయిందని, తమరి సేవలన్నీ ఓట్ల కోసమేనా అని ఎద్దేవా చేశారు. మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి దంపతులను విమర్శించే స్థాయి కాంగ్రెస్ పార్టీ మోటకొండూరు నాయకుడు భూమండ్ల శ్రీనివాస్‌కు లేదన్నారు. సునీత దంపతుల చొరవతోనే శ్రీనివాస్‌కు బీఆర్ఎస్ పార్టీ సర్పంచ్ టికెట్ వచ్చిందని తెలిపారు. సర్పంచ్‌గా ఓడిపోయిన తర్వాత ఎంపీటీసీ టికెట్ వదులుకోవడం కోసం రూ.3లక్షలు తీసుకుంది నిజం కాదా? అని ప్రశ్నించారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు ఎండీ బురాన్, బొట్ల శ్రీనివాస్, బొబ్బిలి బుచ్చిరెడ్డి, బొట్ల పాండు, నరసింహ, శ్రీనివాస్, పరశురాం, ప్రశాంత్, మొగులయ్య పాల్గొన్నారు.

ఘనంగా దాశరథి జయంతి

రామన్నపేట (వలిగొండ), జూలై 22 : తెలంగాణ సాహితీవేత్త, నిజాం నిరంకుశ పాలనను వ్యతిరేకించిన దాశరథి కృష్ణామాచార్యులు 99వ జయంతిని వలిగొండలోని గాయత్రి ఇంగీషు మీడియం ఉన్నత పాఠశాలలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ అనురాధ దాశరథి చిత్రపటానికి నివాళి అర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో స్కూల్ యాజమాన్య సభ్యులు పడమటి మురళీధర్‌రెడ్డి, పాలకూర్ల వెంకటేశం, కవిత, రమా, కవి రచయిత మల్లికార్జున్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మూసీ ప్రక్షాళన - కృష్ణా, గోదావరి జలాల సాధన వేదిక ఏర్పాటు

భువనగిరి అర్బన్, జూలై 22 : జిల్లా ప్రజలకు సాగు, తాగునీరు, ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని కలిగిస్తున్న మూసీ జలాలను ప్రక్షాళన చేసి కృష్ణా, గోదావరి జలాలను సాధించేందుకు పోరాట వేదికను ఏర్పాటు చేసినట్లు వేదిక కన్వీనర్ మాటూరి బాలరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాలకు చెందిన 50 మంది సభ్యులతో ఈ వేదిక ఏర్పాటు చేశామని, రాజకీయాలకు అతీతంగా ప్రజలు, విద్యావంతులు, మేధావులు, రైతాంగం కలిసిరావాలని కోరారు. ఆగస్టు మొదటి వారంలో పిల్లాయిపల్లి, బునాదిగాని, భీమలింగం, ధర్మారెడ్డిపల్లి, ఆసిఫ్‌నెహర్ కాల్వల పరిధిలో సదస్సులు నిర్వహించి ప్రజా పోరాటాన్ని నిర్వహిస్తామని చెప్పారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

యాదగిరిగుట్ట, జూలై 22 : విద్యుదాఘాతంతో పాడి గేదె మృతిచెందింది. మండలంలోని వంగపల్లి గ్రామానికి చెందిన పుసునూరి అశోక్‌కుమార్‌కు చెందిన వ్యవసాయ క్షేత్రంలో శనివారం తన గేదె మేత మేస్తుండగా అక్కడే ఉన్న విద్యుత్ తీగ తెగిపడింది. బర్రెకు తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. బర్రె విలువ సుమారు రూ.80వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

భూ పట్టా రద్దు చేయాలని కలెక్టర్‌కు ఫిర్యాదు

రాజాపేట, జూలై 22 : మండలంలోని బేగంపేటలో ఇండ్ల స్థలాల కోసం కేటాయించిన సర్వే నెంబర్ 168లో 3.38 ఎకరాల భూమిని కొంతమంది అక్రమంగా చేసుకున్న పట్టాను రద్దు చేయాలని సోమవారం భువనగిరిలో కలెక్టర్ హన్మంతు కె.జెండగేకు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఆ భూమిలో కొంత మేరకు ఇండ్ల నిర్మాణాలు చేపట్టామని, మిగులు భూమిని కొంతమంది అక్రమంగా పట్టా చేయించుకొని, ఇండ్ల నిర్మాణం చేపట్టనివ్వకుండా బెదింపులకు పాల్పడుతున్నారని తెలిపారు.

ఇంగ్లిష్ టీచర్‌ను ఏర్పాటు చేయాలని వినతి

మోటకొండూర్, జూలై 22 : మండలంలోని ముత్తిరెడ్డిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ ఉపాధ్యాయులను నియమించాలని కోరుతూ విద్యార్థుల తల్లిదండ్రులు సోమవారం ప్రజావాణిలో అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల బదిలీల్లో గ్రామానికి ఇంగ్లిష్ ఉపాధ్యాయులు వచ్చారని, మరుసటి రోజు నుంచే అనారోగ్య కారణంతో దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారని తెలిపారు. ప్రత్యామ్నాయంగా మరో ఉపాధ్యాయులను ఏర్పాటు చేయలేదన్నారు. కలెక్టర్ చొరవ తీసుకుని ఇంగ్లిష్ ఉపాధ్యాయులను ఏర్పాటు చేసేందుకు డీఈఓకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి : ఎస్ఐ రాఘవేంద్రగౌడ్

బొమ్మలరామారం, జూలై 22 : విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ రాఘవేంద్రగౌడ్ అన్నారు. మండలంలోని సోలిపేట గ్రామంలో గల ఇమ్మానుయేల్ డిగ్రీ కాలేజీలో సోమవారం విద్యార్థులకు సైబర్ క్రైమ్, యాంటీ డ్రగ్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమ లక్ష్య సాధన పట్ల అవగాహనతో ఉండాలన్నారు. తాత్కాలిక సుఖం కోసం మత్తు పదార్థాలు వినియోగిస్తే భవిష్యత్ అంధకారమవుతుందని హెచ్చరించారు. ఎక్కడైనా మత్తు పదార్థాలు అమ్మడం కానీ, వినియోగించడం కానీ జరిగితే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

బదిలీలను నిలిపివేయండి

- ప్రభుత్వ విప్ ఐలయ్యకు దేవస్థాన అధికారుల వినతి

ప్రభుత్వ విప్ ఐలయ్యకు స్వామివారి ప్రసాదం అందజేస్తున్న అధికారులు

యాదగిరిగుట్ట, జూలై 22 : బదిలీలను నిలిపివేయించాలని యాదగిరిగుట్ట దేవస్థాన అధికారులు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యను కోరారు. ఈ మేరకు సోమవారం యాదగిరిగుట్టలోని ఆయన నివాసంలో రాష్ట్ర దేవాలయ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ గజవెల్లి రమేశ్‌బాబు, ఏఈఓలు, పర్యవేక్షకులు, సిబ్బంది వినతి పత్రం అందజేశారు. సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించి యాదగిరిగుట్ట ఆలయ ఉద్యోగుల బదిలీలను నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అసెంబ్లీలో ముఖ్యమంత్రితో మాట్లాడి న్యాయం చేస్తానని ఆయన హామీ ఇచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయనకు స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. ఏఈఓ జూశెట్టి కృష్ణ, సురేందర్‌రెడ్డి, పర్యవేక్షకులు వాసం వేంకటేశం, సింహాచార్యులు, దాసోజు నరేశ్, రాకేశ్‌రెడ్డి, సుధాకర్‌రావు, నగేశ్ పాల్గొన్నారు.

అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

ఆత్మకూరు(ఎం) : ఆత్మకూర్ అభివృద్ధికి అధిక నిధులు మంజూరు చేయాలని గ్రామ మాజీ సర్పంచ్ జెన్నాయికొడె నగేశ్ సోమవారం హైదరాబాద్‌లో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు వినతిపత్రం అందజేశారు. ఆత్మకూరు(ఎం) మెయిన్ రోడ్డు నుంచి శివాలయం వరకు సెంట్రల్ లైటింగ్‌తో డబుల్ రోడ్డు నిర్మాణం నాయిబ్రహ్మణులకు కమ్యూనిటీ హాల్, తిమ్మాపురం ఎక్స్‌రోడ్డు నుంచి బొంత అంజయ్య ఇంటి వరకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సబ్‌స్టేషన్ నుంచి తిమ్మాపురం ఎక్స్‌రోడ్డు వరకు బీటీ రోడ్డు, మార్కెట్ యార్డు నుంచి కామునిగూడెం వరకు బీటీ రోడ్డు నిర్మాణంతోపాటు గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ యాస లక్ష్మారెడ్డి, పోతగాని మల్లేశ్, శ్రీనివాస్, అనిల్, సాయి ఉన్నారు.

విద్య, వైద్య రంగాలకు అధిక నిధులు కేటాయించేందుకు కృషి

- మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

గురుకుల పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

చౌటుప్పల్, జూలై 22 : వచ్చే బడ్జెట్లో విద్య, వైద్య రంగాలకు అధిక నిధులు కేటాయించేందుకు కృషి చేస్తానని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. చౌటుప్పల్ పట్టణంలోని బాలికల గురుకుల పాఠశాలను సోమవారం ఆయన సంద